**విజయవాడ నగర పోలీస్ కమీషనర్ వారి కార్యాలయము**

**పత్రికా ప్రకటన** **తేదీ :17-10-2018.**

# <u>బట్టల వ్యాపారం ముసుగులో ప్రయాణీకులకు మత్తుమందిచ్చి దొంగతనాలు చేస్తున్న నిందితుడు అరెస్ట్</u>

## *అతని వద్ద నుండి మొత్తం సుమారు రూ.4 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం*

ఈ మధ్య కాలంలో నగరంలో జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక దృష్టిసారించిన నగర పోలీస్ కమీషనర్ శ్రీ సి. హెచ్.ద్వారకా తిరుమలరావు ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు క్రైమ్ డిసిపి శ్రీమతి బి.రాజకుమారి ఐపిఎస్ గారి పర్యవేక్షణలో దొంగతనాల నియంత్రణ నిమిత్తం పోలీసు గస్తీని ముమ్మరం చేయడంతో పాటు అంతర్‌జిల్లా, అంతర్ రాష్ట్ర నేరస్థులు, పాత నేరస్థులు, జైలు నుండి విడుదలైన నేరస్థులు, అనుమానాస్పద వ్యక్తులపై నేరస్థులపై నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ మధ్య కాలంలో బస్సుల్లో జరిగిన దొంగతనం కేసుల్లో నిందితుడి గురించి అందిన పక్కా సమాచారం మేరకు ది.05.10.2018న ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం, మీరట్ జిల్లా, సౌరబ్‌గేట్ బస్‌స్టాప్ వద్ద అక్కడి స్థానిక పోలీసు వారి సహకారంతో కృష్ణలంక పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేసి, విచారణ అనంతరం అతన్ని విజయవాడ కోర్టులో ప్రవేశ పెట్టగా న్యాయస్థానం నిందితుడికి రిమాండ్ విధించడం జరిగింది. అనంతరం తదుపరి పూర్తి సమాచారం కోసం నిందితుడిని న్యాయస్థానం ద్వారా కృష్ణలంక పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించడంతో బస్సుల్లో చేసిన పలు దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి. అరెస్ట్ చేసిన నిందితుడు తన సమీప బంధువుతో కలసి బస్సుల్లో సామాన్య వ్యక్తిలా ప్రయాణిస్తూ తోటి ప్రయాణీకులకు మత్తు మందిచ్చి, వారు నిద్రలోకి జారుకున్న తరువాత వారి వద్ద బ్యాగుల్లో మరియు వంటిపై ఉన్న నగదు, నగలు మరియు ఇతర వస్తువులు దొంగిలించినట్లు వెల్లడి కావడంతో నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి 74 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1,19,500/-ల నగదు మరియు రెండు సెల్‌ఫోన్‌లు మొత్తం కలిపి సుమారు రూ.4 లక్షల విపులైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మీరట్‌కు చెందిన మహ్మద్ యూనస్ (46) గతంలో కొంత కాలం స్థానికంగా అక్కడ టింకరింగ్ పనులు చేసి మానేశాడు. అనంతరం మీరట్‌లో కొంత కాలం హోటల్ నడిపి అందులో నష్టాలు రావడంతో హోటల్ నిర్వహణ కూడా మానుకున్నాడు. ఈ క్రమంలో విజయవాడ మరియు హైదరాబాద్‌లో బట్టల వ్యాపారం నిర్వహించే తనకు సమీప బంధువైన ఒక వ్యక్తిని సంప్రదించి బ్రతుకుదెరువుకు సలహా అడిగాడు. ఇందుకు బట్టల వ్యాపారి తాను బట్టల వ్యాపారం పేరుతో బస్సుల్లో ప్రయాణిస్తూ తోటి ప్రయాణీకులకు మత్తు మందు కలిపిన ఆహార పద్దార్థాలు ఇచ్చి దొంగతనాలు చేస్తానని అసలు విషయం బయటపెట్టగా తాను కూడా ఇదే తరహాలో నేరాలు చేసి సులబంగా డబ్బు సంపాదించాలని యూనస్ నిర్ణయించుకుని తన సమీప బంధువుతో జత కలిశాడు. ఇద్దరు నిందితులు కలసి బట్టల వ్యాపారం ముసుగులో బస్సుల్లో ప్రయాణిస్తూ తోటి ప్రయాణీకులతో ముందుగా మాటలు కలుపుతారు. వీరిపై నమ్మకం ఏర్పడిన తరువాత తోటి ప్రయాణీకులకు మత్తు మందు కలిపిన క్రీమ్ బిస్కట్లు, కూల్‌డ్రింక్ లేదా బాదంపాలు తదితర ఆహార పదార్థాలను ఇస్తారు. ప్రయాణీకులు మత్తు మందు కలిపిన ఆహారపదార్థాల ప్రభావం వలన నిద్రలోకి జారు కోగానే వారి వద్ద బ్యాగుల్లో మరియు వంటిపై ఉన్న నగలు, నగదు, సెల్‌ఫోన్‌లు, ఇతర వస్తువులను దొంగిలించి తరువాత వచ్చే బస్‌స్టాప్‌లో దిగి వెళ్లిపోతారు. మత్తు మందు కలపని బిస్కట్‌లు, కూల్ డ్రింక్ లేదా బాదంపాలను ముందుగా నిందితులు తీసుకుని తోటి ప్రయాణీకులకు నమ్మకం కలిగిస్తారు. అనంతరం బాధితులకు మత్తు మందు కలిపిన ఆహార పదార్థాలను ఇచ్చి వారు నిద్రలోకి జారుకోగానే దొంగతనాలకు పాల్పడతాడతారు. ఈ విధంగా హైదరాబాద్ నుండి విశాఖపట్నం వయా విజయవాడ, విశాఖపట్నం నుండి బెంగుళూరు వయా విజయవాడ మీదుగా సాయంత్రం మరియు రాత్రి సమయాల్లో బస్సుల్లో ప్రయాణిస్తూ దొంగతనాలు చేయడం జరిగింది.

ఇద్దరు నిందితులు కలసి **(1)** ది.16.01.2017న విజయవాడ నుండి విశాఖపట్నం వెళ్ళే బస్సులో మత్తు మందు కలిపిన కూల్‌డ్రింగ్‌ను తోటి ప్రయాణీకుడి చేత త్రాగించి, **(2)** ది.12.05.2017న హైదరాబాద్ నుండి విజయవాడ వచ్చే బస్సులో ప్రయాణిస్తూ తోటి ప్రయాణీకుడికి మత్తు మందు కలిపిన కూల్‌డ్రింగ్‌ను ఇవ్వడం ద్వారా, **(3)** ది.10.09.2018న విశాఖపట్నం నుండి కడప వెళ్ళే బస్సులో ప్రయాణిస్తూ తోటి ప్రయాణీకుడికి మత్తు మందు కలిపిన బాదం పాలు ఇవ్వడం ద్వారా, **(4)** ది.12.09.018న రాజమండ్రి నుండి విజయవాడ వచ్చే సూపర్ లగ్జరీ బస్‌లో ప్రయాణిస్తూ తోటి ప్రయాణీకుడికి మత్తుమందు కలిపిన బిస్కట్లు ఇవ్వడం ద్వారా, **(5)** ది.21.09.2018న హైదరాబాద్ నుండి తుని వయా విజయవాడ బస్సులో ప్రయాణిస్తూ తోటి ప్రయాణీకుడికి మత్తు బిస్కట్లను ఇచ్చి పైన పేర్కొన్న విధంగా దొంగతనాలు చేయడం జరిగింది. దొంగిలించిన సొత్తును నిందితుడు హైదరాబాద్‌లోని అఫ్జల్ గంజ్‌లోని బాలాజీ జ్యూలరీలో షాపులో తాకట్టుపెట్టడం జరిగింది. తాకట్టుపెట్టిన బంగారాన్నికూడా కృష్ణలంక పోలీసు వారు రికవరీ చేసుకోవడం జరిగింది. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నేరస్థుడు మహ్మద్ యూనస్ సమీప బంధువును పట్టుకోవడానికి చర్యలు తీసుకోవడం జరిగింది.

-- xx --